# విడాకులు

శ్రీమతి నెమిలి చంద్రమతిగారు

విమల కిరువది సంవత్సరములు నిండినవి. ఆమె సద్గుణరాశి, సౌందర్యవతి. భర్త గృహమునకు వచ్చి అయిదు సంవత్సరము లయినది. భర్త రామచంద్రుడు యిరువది యయిదేండ్ల ప్రాయమువాడు. సుందర పురుషుడు, గుణవంతుడునై యుండెను అతడు గొప్ప యుద్యోగస్థుడు, యాస్తిపరుడుకూడాను. ఒకనాడైనను యొకరి నొకరు విడిచియుండలేదు. ఒకనిముష మెడబాటు యొకయుగముగ తోచుచుండెను. ఒకరినొకరు మిగుల గాఢముగ ప్రేమించుచుండిరి.

ఇటుల సంతోషముగ వారు కాలము గడుపుచుండగ విధివశమున రామచంద్రుడు స్ఫోటకముపడెను. దానితో యతని రూపు మారిపోయెను, కండ్లుకూడ పోయినవి. ఇది మాత్రము చాలక దరిద్ర దేవత కూడ యాహ్వానించెను. ఉద్యోగము పోయెను. ధనమంతయు గోల్పోయెను. విమల యిదంతయు చూచి మిగుల చింతించెను. ఏమి చేయగలదు? దైవయత్నము! కండ్లుపోయి వికృతముగ మారిన తన భర్తను మునుపటి కంటె వేయిరెట్లధికముగ ప్రేమించుచుండెను. విమల కొంత విద్య నేర్చినదవుటచే కొంతమంది పిల్లలకు చదువు చెప్పి స్వల్పముగ వేతనము సంపాదించి, దానితో కాలము గడుపుచుండెను. భర్తకు తోడు నీడై మెలగుచుండెను.

ఒకనాడు రామచంద్రుడు భార్యతో నిట్లు చెప్పెను. "విమలా, మన దేశమున విడాకులచట్టమమలులోనికివచ్చిన నెంత బాగుండును! నే నిక యావజ్జీవము గ్రుడ్డివాడనై ఈవిధముగ నుండవలసినవాడనే కదా? ఈ దరిద్రునితో కూడ నున్న నీ కేమి సుఖము? సంపదలతో తులతూగు మనము పూటకు గతిలేనివారమైతిమి కదా? ఆహా కాలము! ఎంతటిలో నెంతమార్పు కల్గెను! నన్ను నా దారిని విడువుము. నేను భిక్ష మెత్తుకొనియైన బ్రతుకగలను. పట్టు పాన్పులపై పండుకొను నీవు యీ కఠిన నేలపై పండుకొనుటకు నీ కోమలశరీర మెట్లోర్చుచున్నది? నీయట్టి సౌందర్యవతి, సద్గుణవతియగు భార్యనుగూడి సుఖించుటకు నేను పుణ్యము చేయలేదుకదా? నే నిక నీ ప్రపంచములోనుండి యేమి ప్రయోజనము? చూచి యానందించుటకుకూడా కండ్లు లేవు. నీ విష్టపడిన నీ క్షణముననే నెంతోమంది యౌవనులు, సుందరులు, ధనవంతులు నిన్ను చెట్టబట్ట నువ్విళ్లూరుచుందురు. ఒక ధనవంతుడైన సుందరపురుషుని పెండ్లిచేసుకుని సుఖముగ జీవింపవచ్చును కదా నాతోనుండి కష్టపడుటకంటె."

ఇది విని విమల నవ్వుచూ "నాథా, మీరు నిజముగా నీ మాటలు నుడువుచున్నారా లేక పరిహాసార్థముగానా? ఎంతమాట చెప్పితిరి!! అగ్నిసాక్షిగ పరిణయమాడిన పంచప్రాణములతో ప్రేమించుచున్న భర్తకు విధివశమున కండ్లుపోయి, ధనమును గోల్పోయినంతమాత్రమున యతనిని విడచి వేరొకరిని ప్రేమించుటయా?

మరియొకరిని చెట్టబట్టుటయా ఈ జన్మలో! ఆహా ఏమికాలము! మీకు చెప్పుటకైన నోరెట్లువచ్చినది?

సిగ్గు, సిగ్గు. హిందూదేశముయొక్క పతివ్రతాధర్మము మఱచినారా? పతివ్రతల చరిత్రలు జ్ఞప్తికిరాలేదా? ఈధర్మ ముండబట్టియే 'భారతనారీమణు'లని పేరు వచ్చినది. అట్లుగాక పాశ్చాత్య యువతులవలె చీటికి మాటికి విడాకు లిచ్చుచుండిన ఆ పే రెందుకువచ్చును? మూడు నాళ్లలో మూలబడిపోదా? భార్య భర్తయొక్క యర్ధాంగి కదా? ఎంత కష్టము కల్గినను, ఎంత సుఖము కల్గినను ఇద్దరును సమముగ అనుభవింపవలసినవారే కదా? ఒకరిని మనసారగ ప్రేమించిన మనస్సు వారిని విడిచి వేరొకరిని ప్రేమింపకల్గునా? ఈవిధముగ చపలమైన ప్రేమ ప్రేమయగునా? భార్యాభర్తల ప్రేమ పవిత్రమైనది, నిష్కల్మషమైనది, నిశ్చలమైనది, నిర్మలమైనది కదా. అటువంటి ప్రేమను తృణీకరించిన 'ప్రేమ' యను పదమే నశించిపోదా? విడాకులచట్టము మన దేశమున కెంతమాత్రము పనికిరాదు.

అయితే పురుషులలో కొందరు కలి యుగరాక్షసులు కూడనున్నారు. భార్య చనిపోయిన మరునాడే వేరొక సతిని చేబట్టుటకు సిద్ధముగానుందురు. భార్యను సదా పీడించువారు కొందరు. ఇటువంటివారికి శిక్ష విధించు చట్టము వచ్చిన బాగుండును కాని, విడాకుల చట్టము మంచిదికాదని నా యూహ" అనెను.

"నా సుగుణముల ఖనివగు విమలా! నా ప్రేమమయమూర్తీ! నే నన్నమాటలకు నన్ను క్షమింపుము. నీ విలాగున చెప్పుదువని తెలిసియే నే నటులంటిని. నీవంటి భార్యను బడయుటకు నా పూర్వజన్మ సుకృతముకాని వేరుకాదు" అని విమలను దగ్గరకు తీసుకొని శిరసుయక్కునజేర్చి ఆనందబాష్పములు రాల్చెను. కొంతసేపు యిరువురును పరమానందసముద్రమున లీనమైపోయిరి! * * *

ఆహా! కళంకరహితమైన ప్రేమయొక్క ప్రభావమేమి! ఎటువంటి కష్టములోనైనను భార్యాభర్త లిరువురి హృదయము లేకమైన నీటిలోనుండియు తామరాకునకు జలము సోకనటుల కష్టములోనుండియు వారి కది సోకదుకదా?

——:0:——

## భేదాభేదములు

శ్రీమతి విద్వాన్ కంచనపల్లి కనకాంబగారు

"భేదమేయున్నచో భేదమేయుండు
భేదమరయకున్నఁ బ్రీతియేనుండు
వ్యవహారమునవెట్లు పరమార్థమందు
శివజీవభేదంబుచే నట్లుకుండు
భేదింపగాఁదత్త్వ భేదంబుకలుగు
సాధింపగానౌను సామ్యమవ్వలను

దలవెండ్రుకలకుండుఁ దద్దయుఁబూజ
తలవదలినవెన్కఁదగునె యాపూజ
మైక్యసిద్ధిని దేవుననుభవంబుండు
నైక్యంబులేనిచో నధముఁడై యుండు
నేదైన, నెట్లున్న, నీశ్వరుండన్న
రాదుజన్మం"బాత్మరాముఁడే"యన్న